


అరూరి రమేష్



గులాబీకి ఝలక్!

బీజేపీలోకి మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్

వరంగల్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గులాబీ పార్టీకి నేతలు ఝులక్ ఇస్తున్నారు. ఒక్కొక్క రుగా కారు దిగి ఎవరి దారి వారు చూసుకుంటున్నారు. ఇటీవల మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య పార్టీని వీడగా, తాజాగా వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ గులాబీ పార్టీకి గుడ్‌బై చెప్పేందుకు సిద్ధమయ్యారు. బీజేపీలో చేరేందుకు రమేష్ రంగం సిద్ధం చేసుకున్నారు. మరో వైపు వరంగల్ నగర మేయర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు సైతం బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లోకి చేరేందుకు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అలాగే వర్ధన్నపేట మునిసిపల్ చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో హస్తం గూటికి చేరగా, డీసీసీబీ ఛైర్మన్ మార్నేని సైతం పార్టీ మారేందుకు సిద్ధపడుతున్నట్లుగా సమాచారం. ఒక్కొక్కరు కారు దిగుతుండటంతో గులాబీ పార్టీకి భారీ షాక్‌గా మారుతుంది. వివరాల్లోకి వెళితే...

ఓటమితో గులాబీ డీలా...

గత అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ పార్టీ భారీ ఓటమితో డీలా పడింది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో ములుగు, భూపాలపల్లి మినహా 10 చోట్ల గులాబీ పార్టీ విజయం సాధించింది. ఆ తరువాత మూడు నెలలకే భూపాలపల్లి ఎమ్మెల్యే హస్తం పార్టీ వీడి గులాబీ కారు ఎక్కారు. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్‌కు ఎదురులేకుండా రాజకీయాలు నడిచాయి. అయితే 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో సహా కీలక నేతలు ఓటమి పాలవ్వడంతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. కేవలం జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. దీంతో గులాబీ క్యాడర్ డీలా పడింది. పైగా 2028లో నియోజకవర్గాల పునర్విభజన జరగనుంది. ఈ నేపథ్యంలో అప్పటి వరకు ఏ నియోజకవర్గం ఏ రిజర్వుడు కోటాలోకి వెళుతుందో అనే ఆందోళనతో ఉన్న నేతలు దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్క పెట్టుకోవాలనే ఆలోచనతో పక్క పార్టీల వైపు చూస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే బీఆర్ఎస్‌లో అసమ్మతి గళం విప్పిన మాజీ డిప్యూటీ సీఎం తాటికొండ రాజయ్య పార్టీకి రాజీనామా చేశారు. అప్పటి నుంచి ఒక్కొక్కరు గులాబీ పార్టీని వీడేందుకు సిద్ధమవుతుండటం గులాబీ శ్రేణుల్లో ఆందోళనకు గురి చేస్తోంది.

గులాబీ పార్టీకి అరూరి గుడ్‌బై..?

గులాబీ పార్టీకి మరో భారీ షాక్ తగలనుంది. బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పార్టీని వీడేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి పోటీ చేయాలనే ఆలోచనతో ఉన్న అరూరికి గులాబీ అధిష్ఠానం నుంచి సానుకూలత రాలేదు. స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి కుమార్తె కడియం కావ్యను వరంగల్ ఎంపీ బరిలో దించేందుకు బీఆర్ఎస్‌లో చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ నుంచి పోటీ చేయాల్సిందిగా ఆ పార్టీ నుంచి అరూరి రమేష్‌కు ఆఫర్ వచ్చింది. దీంతో తన అనుచర వర్గంతో గత రెండు రోజులుగా చర్చలు జరిపారు. బీజేపీ జాతీయ నేతల నుంచే ఆహ్వానం రావడంతో బీజేపీలో చేరి వరంగల్ ఎంపీగా పోటీ చేయాలని నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి విజయం సాధించిన అరూరి రమేష్ 2023 ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానం నుంచి బీఆర్ఎస్ పోటీకి అవకాశం లేకపోవటంతో బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారనే టాక్ వినిపిస్తోంది. ఆర్థికంగా బలంగా ఉన్న అరూరి రమేష్‌కు వర్ధన్నపేట, స్టేషన్‌ఘన్‌పూర్, వరంగల్ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో వ్యక్తిగత పరిచయాలు ఉన్నాయి. దీంతో పాటు బలమైన మాదిగ సామాజిక వర్గం నేత కావడంతో అరూరి రమేష్‌ను బరిలో దించితే గెలిచే అవకాశాలు ఉంటాయని బీజేపీ కూడా అంచనా వేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గత నెల రోజులుగా బీజేపీ రాష్ట్ర, జాతీయ నాయకత్వం నుంచి వస్తున్న ఆహ్వానంతో పార్టీ మారేందుకు అరూరి నిర్ణయం తీసుకున్నట్లుగా సమాచారం.

- వరంగల్ ఎంపీగా బరిలో దిగుతారని ప్రచారం
- త్వరలో ప్రధాని మోదీ సమక్షంలో చేరిక
- మరో మాజీ ఎంపీ చూపు కమలం వైపు
- మహబూబాబాద్ టికెట్ కోసం చర్చలు
- వరంగల్ మేయర్‌తో సహా పలువురు కార్పొరేటర్లు హస్తం గూటికి..
- సీఎం సమక్షంలో చేరేందుకు ఏర్పాట్లు
- కాంగ్రెస్‌లో చేరిన వర్ధన్నపేట మునిసిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్
- కండువా కప్పి ఆహ్వానించిన సీఎం రేవంత్‌రెడ్డి
- డీసీసీబీ అధ్యక్షుడు మార్నేని రవీందర్‌రావు చూపు హస్తం వైపు


సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మేయర్ గుండు సుధారాణి

కాగా, రమేష్ పార్టీ మారేందుకు నిర్ణయం తీసుకున్నట్లు జరుగుతున్న ప్రచారంతో బీఆర్ఎస్ అగ్ర నేతలు అలర్ట్ అయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావులు అరూరితో ఫోన్‌లో సంప్రదింపులు చేసినట్లుగా తెలిసింది. అయితే పార్టీ మారాలని నిర్ణయం తీసుకున్నానని, ఇన్ని రోజులు పార్టీలో సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపినట్లుగా సమాచారం. మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సైతం నేరుగా రమేష్ నివాసానికి వెళ్లి పార్టీ తరఫున బుజ్జగించే ప్రయత్నం చేసినప్పటికీ అరూరి పార్టీ మారేందుకే ఫిక్స్ అయినట్లుగా తేల్చి చెప్పినట్లుగా సమాచారం. సోమవారం ఆదిలాబాద్ జిల్లా పర్యటనకు వస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో పార్టీలో చేరటం లేదంటే మరో రోజు ఢిల్లీకి వెళ్లి పార్టీలో చేరడం జరుగుతుందని అరూరి సన్నిహితులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. మొత్తానికి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, రెండు పర్యాయాలు వర్ధన్నపేట ఎమ్మెల్యేగా పనిచేసిన అరూరి రమేష్ పార్టీని వీడేందుకు

మిగతా 5వ పేజీలో..

కమలం వైపు మాజీ ఎంపీ చూపు..?

బీఆర్ఎస్‌కు మరో షాక్ తగిలేలా ఉంది. మహబూబాబాద్ పార్లమెంట్ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్న ఓ మాజీ ఎంపీ సైతం పార్టీని వీడేందుకు సిద్ధమవుతున్నట్లుగా సమాచారం. మహబూబాబాద్ సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత మరోసారి పోటీకి ఆసక్తి చూపుతున్నారు. అయితే ఖమ్మం జిల్లా వైరా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ తన కుమారుడి కోసం మహబూబాబాద్ టికెట్ కేటాయించాలని బీఆర్ఎస్ అధిష్ఠానంపై ఒత్తిడి తెస్తున్నట్లుగా సమాచారం. అయితే తనకు ఈసారి కూడా బీఆర్ఎస్ టికెట్ ఇవ్వడం కష్టమేననే నారాజ్‌లో ఉన్న ఓ మాజీ ఎంపీకి బీజేపీ నేతల నుంచి పోటీ చేసేందుకు పార్టీలో చేరాలని ఆహ్వానం అందినట్లుగా ప్రచారం జరుగుతోంది. అనుచరుల ఒత్తిడి మేరకు బీజేపీలో చేరేందుకు ఆ మాజీ ఎంపీ కూడా సిద్ధమవుతున్నట్లుగా తెలిసింది.


జాకారంలో ముదిరాజ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

గట్టమ్మ దేవాలయంలో ముదిరాజ్‌లే పూజారులు

- మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవేందర్

ములుగు, మార్చి 3: గట్టమ్మ దేవాలయంలో జాకారానికి చెందిన ముదిరాజ్ కులస్థులను పూజారులుగా కొనసాగించాలని ఇటీవల హైకోర్టు ఇచ్చిన తీర్పును అధికారులు అమలుచేయాలని ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ డిమాండ్ చేశారు. జాకారంలో ముదిరాజ్ పూజారులతో ఆయన ఆదివారం సమావేశమయ్యారు. కొన్నేళ్లుగా కొనసాగుతున్న గట్టమ్మ దేవాలయ వివాదం, కోర్టు తీర్పులపై చర్చించారు. 1953లో గట్టమ్మ దేవాలయాన్ని ఏర్పాటు చేసుకున్న జాకారం గ్రామానికి చెందిన ముదిరాజ్‌లు అనాదిగా పూజలు చేస్తున్నారని తెలిపారు. నాయకపోడ్‌ల కారణంగా హక్కులపై వివాదం నెలకొందని, పలు సందర్భాల్లో కోర్టులు ముదిరాజ్‌లకు అనుకూలంగా తీర్పునిచ్చినప్పటికీ అధికారులు అమలు చేయలేదని తెలిపారు. ఈఏడాది ఫిబ్రవరి 15న ముదిరాజ్‌లే గట్టమ్మ పూజారులని పేర్కొంటూ కోర్టు తీర్పునిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో మెపా రాష్ట్ర నాయకుడు నీరటి రాజు, జిల్లా కన్వీనర్ అచ్చునూరి కిషన్, కృష్ణ, చిరంజీవి, ఈర్ల చేరాలు, దండబోయిన రఘుపతి, శామంతుల సమ్మల్లు, కొమురయ్య, ఐలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క సాగర్ నుంచి కొనసాగుతున్న నీటి విడుదల


సమ్మక్క సాగర్‌లో నీళ్లు

కన్నాయిగూడెం, మార్చి 3 : మండలంలోని తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ నుంచి 2,760 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో శనివారం వరకు రెండు గేట్ల ద్వారా 6 వేల క్యూసెక్కుల నీళ్లు వదిలారు. ఆదివారం మరో గేటు ఎత్తి మొత్తం మూడు గేట్ల ద్వారా 15 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో బ్యారేజీలో నీటి నిల్వలు భారీగా తగ్గాయి. బ్యారేజీ పూర్తి నీటి సామర్థ్యం 6.94 టీఎమ్సీలు కాగా ప్రస్తుతం 1.78 టీఎమ్సీలు నిల్వ ఉన్నాయి. ఈ నీటి విడుదల ఇలాగే కొనసాగితే రెండు రోజుల్లో బ్యారేజీలోని నీటి నిల్వలు తగ్గి ఇసుక మేటలు దర్శనమిస్తాయి. ప్రస్తుతం సమ్మక్క సాగర్ వద్ద 78.40 నీటిమట్టం నమోదైంది. ఇదిలా ఉండగా దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. వేసవి వచ్చి ఎండలు ముదరటంతో నగరాల్లో నీటి అవసరం పెరిగింది. ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు రిజర్వాయర్లను నింపుతున్నారు మొత్తం ఐదు మోటార్ల ద్వారా 1,414 క్యూసెక్కుల నీటిని ఎత్తి పోస్తున్నారు. ఇన్‌టేక్‌వెల్ వద్ద 75.80 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత


పీడీఎస్ బియ్యం లోడుతో ఉన్న వ్యాను

మహదేవపూర్, మార్చి 3: పేదలకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని కొంత మంది అక్రమంగా తరలిస్తుండగా ఆదివారం తెల్లవారుజామున గ్రామస్థులు పట్టుకున్నారు. కరీంనగర్ నుంచి మహారాష్ట్రలోని సిరోంచకు బియ్యాన్ని రవాణా చేస్తున్న రెండు వ్యాన్లను వాకింగ్‌కు వెళ్లిన గ్రామస్థులు గుర్తించి అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డిప్యూటీ తహసీల్దార్ కృష్ణ అక్కడికి చేరుకొని డ్రైవర్లు రాజు, శ్యాంను విచారించారు. తాము వడ్లను రైస్‌మిల్లుకు తీసుకొచ్చి బియ్యాన్ని తీసుకుపోతున్నట్లు వివరించారు. గ్రామస్థులు, అధికారులు వాహనాల్లో తనిఖీ చేయగా పీడీఎస్ సంచుల్లో బియ్యం ఉన్నట్లు గుర్తించారు. రెండు వ్యాన్లలో 600 బస్తాల్లో 300 క్వింటాళ్ల బియ్యం ఉన్నట్లు గుర్తించిన అధికారులు కేసు నమోదు చేశారు. రెండు వాహనాలను బియ్యం సహా స్వాధీనం చేసుకొని డ్రైవర్లు శ్యాం, రాజులను అదుపులోకి తీసుకున్నారు. 300 క్వింటాళ్ల బియ్యాన్ని మహదేవపూర్‌లో నిల్వ ఉంచే అవకాశం లేకపోవడంతో కాటారంలోని అన్నపూర్ణ రైస్‌మిల్లుకు తరలించినట్లు డీటీ కృష్ణ తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఐటీడీఏ పీవో


పీవో చిత్రమిశ్రా

ఏటూరునాగారం రూరల్, మార్చి 3: ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్‌గా చిత్రమిశ్రా బాధ్యతలు స్వీకరించారు. పీవోగా ఇక్కడ పనిచేసిన అంకిత్‌ను ప్రభుత్వం నిజామాబాద్‌కు బదిలీ చేసింది. ఆయన స్థానంలో చిత్రమిశ్రాను బదిలీ చేసింది. నిజామాబాద్ అదనపు కలెక్టర్‌గా ఉన్న ఆమెను ఏటూరునాగారం ఐటీడీఏ పీవోగా నియమించింది. అయితే మేడారం జాతర నేపథ్యంలో చిత్రమిశ్రా బాధ్యతలు స్వీకరించలేదు. జాతర అనంతరం పార్లమెంటు ఎన్నికల శిక్షణకు ఆమె హైదరాబాద్‌కు వెళ్లారు. ఆతర్వాత ఐటీడీఏ కార్యాలయంలో పీవోగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు.

నేడు గిరిజన దర్బార్

మేడారం జాతర నేపథ్యంలో ఐటీడీఏ కార్యాలయంలో కొన్ని వారాలపాటు వాయిదా పడిన గిరిజన దర్బార్ సోమవారం జరగనుంది. జాతర ముగియడంతో పీవో చిత్రమిశ్రా యధాతథంగా గిరిజన దర్బార్ నిర్వహించనున్నారు. అన్నిశాఖల అధికారులు సంబంధిత వివరాలతో హాజరుకావాలని ఆమె ఆదేశాలు జారీ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య 6
మొగుళ్లపల్లి మండలం పర్లపల్లిలో ఘటన

పోలియో రహిత సమాజమే లక్ష్యం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


భూపాలపల్లి పీహెచ్‌సీలో చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


ములుగు ఏరియా వైద్యశాలలో చిన్నారికి చుక్కల మందు వేస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

భూపాలపల్లి కలెక్టరేట్, మార్చి 3: పోలియో రహిత సమాజ ఏర్పాటే లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. పల్స్ పోలియో కార్యక్రమం భూపాలపల్లి పీహెచ్‌సీలో ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే సత్యనారాయణరావు హాజరై చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం పుట్టిన పిల్లల నుంచి 5 ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల పరిధిలో పల్స్‌పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అనివార్య కారణాల వల్ల పిల్లలకు పోలియో చుక్కలు వేయించని వారి ఇంటికి ఈనెల 4,5 తేదీలో వైద్యసిబ్బంది వచ్చి వేస్తారని అన్నారు. ఈకార్యక్రమంలో డీఎంహెచ్‌వో మధుసూదన్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీదేవి, ప్రోగ్రాం ఆఫీసర్ అన్వేషిణి తదితరులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలు తప్పనిసరి : ములుగు డీఎంహెచ్‌వో

ములుగు కలెక్టరేట్ : జిల్లాలోని 0-5ఏళ్లలోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య అన్నారు. ములుగులోని ఏరియా వైద్యశాల ఆవరణలో జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా అప్పయ్య మాట్లాడుతూ జిల్లాలోని ఇటుక బట్టీలు, గోదావరి పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్న వారు, కాటన్ మిల్లుల్లో పనిచేస్తున్న కార్మికుల పిల్లలకు, ఇతర ప్రాంతాల్లో మొబైల్ టీంల ద్వారా అక్కడి పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేస్తున్నట్టు తెలిపారు. బస్టాండ్లు, ప్రధాన కూడళ్లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి పిల్లలకు పోలియో చుక్కలు వేశామని తెలిపారు. సోమ, మంగళవారాల్లో వైద్యసిబ్బంది ఇంటింటికీ తిరిగి చిన్నారులను గుర్తించి చుక్కల మందు వేస్తారని పేర్కొన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, యూత్ సభ్యులు పాల్గొని పిల్లలకు వందశాతం చుక్కల మందు వేయించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ అధికారి స్వర్ణలత, జిల్లా పిల్లల సంరక్షణ అధికారి ఓంకార్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ విపిన్‌కుమార్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


విద్యుత్ తీగ విసిరి హత్యాయత్నం


చికిత్స పొందుతున్న రవీందర్

కన్నాయిగూడెం, మార్చి 3: విద్యుత్ తీగను విసిరి ఓ వ్యక్తిపై హత్యాయత్నం చేసిన సంఘటన మండలంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సురేష్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గంగగూడెం గ్రామానికి చెందిన కావిరి రవీందర్, దేవి దంపతులు వ్యవసాయ కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన కావిరి ప్రమోద్ అనే యువకుడు రవీందర్‌కు దగ్గరి బంధువు. అవివాహితుడైన ప్రమోద్ వ్యవసాయ పనులు చేసుకుంటూ తల్లిదండ్రులను పోషించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో దేవిపై కన్నేసిన ప్రమోద్ ఆమెను ఎలాగైనా వశం చేసుకోవాలని భావించాడు. ఇందుకు రవీందర్‌ను అడ్డుతొలగించాలని హత్యకు పథకం రచించాడు. శనివారం రాత్రి రోడ్డు పక్కన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి వేలాడుతున్న వైరును రవీందర్ ఇంటి సమీపంలోకి లాగాడు. ఆ సమయంలో తనకు షాక్ తగలకుండా జాగ్రత్తలు పాటించాడు. రవీందర్ మూత్రం కోసం బయటకు రాగానే ఒక్క సారిగా విద్యుత్ వైరును అతడిపై విసిరాడు. షాక్‌కు గురైన రవీందర్ బిగ్గరగా అర వడంతో చుట్టుపక్కల వారు నిద్రలేచి వచ్చారు. ఈలోగా ప్రమోద్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ ఘటనలో రవీందర్‌కు కాలు, తొడ, వీపు భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి.

దీంతో అతడిని ఏటూరునాగారం సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వరంగల్ లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. తనను లొంగదీసుకొనేందుకే తన భర్తపై ప్రమోద్ హత్యాయత్నం చేశాడని దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

8 నుంచి 'రామప్ప'లో మహాశివరాత్రి ఉత్సవాలు



వెంకటాపూర్(రామప్ప), మార్చి 3: మండలంలోని పాలంపేట గ్రామంలో రామప్ప రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ఈనెల 8 నుంచి 10 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. 8న ఉదయం 4.30 గంటలకు సుప్రభాతం, 6 గంటలకు గణపతిపూజ, అఖండ దీపారాధన, పుణ్యాహవచనం, అంకురార్పణ, రక్షబంధనం, రుత్విక్కరణం, సామూహిక రుద్రాభిషేకాలు, రాత్రి 10గంట లకు స్వామివారి కల్యాణ మహోత్సవం, జాగరణ జరుగనుంది. 9న ఉదయం 5గంటలకు సుప్రభాతం, గణతిపూజ, రుద్రాభి షేకం, 11గంటల నుంచి గణపతిపూజ, గ్రహారాధన, వీరభద్ర పల్లేరం, సాయంత్రం భద్రకాళిపూజ, సహస్రనామార్చన, బలిహరణ, రాత్రి దీపోత్సవం, ఇదేరోజు 10న తెల్లవారుజామున 4గంటలకు అగ్నిగుండంలో నడిచే కార్యక్రమం ఉంటుంది. ఉదయం 5గంటలకు సుప్రభాతం, గణతిపూజ, రుద్రా భిషేకం, 8 గంటలకు నాగబలి, గెలుపు, ఆశీర్వచనం, ప్రసాద వినియోగం నిర్వహించనున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని ఆలయ ఈవో బిల్ల శ్రీనివాస్ కోరారు.

వీరభద్రస్వామి జాతరను సక్సెస్ చేయాలి

ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్



జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జాటోతు రాంచంద్రునాయక్

కురవి, మార్చి 3 : మహాశివరాత్రిని పురస్కరించుకుని ఈనెల 7 నుంచి జరిగే కురవి వీరభద్రస్వామి జాతరను విజయవంతం చేయాలని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. కురవి వీరభద్ర స్వామి దేవాలయంలో ఆదివారం జాతర పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కురవి జాతర కోసం ప్రభుత్వ పరంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భక్తులు ఎలాంటి అసౌకర్యం కలుగకుండ జాగ్రత్తలు వహించాలన్నారు. ఈ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మెంబర్ మాలోతు నెహ్రూనాయక్, అంబటి వీరభద్రం, ఈవో సత్యనారాయణ, కోర్ని రవీందర్, బలగాని శ్రీనివాస్, ఎన్.రాజేందర్‌కుమార్, అవిరె మోహన్‌రావు, రామునాయక్ పాల్గొన్నారు.

వీరభద్రస్వామి దేవాలయ ఉత్సవ కమిటీ ఖరారు



చైర్మన్ రవీందర్‌రెడ్డి

కురవి, మార్చి 3 : కురవి భద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామి దేవాలయ మహాశివరాత్రి జాతర ఉత్సవ కమిటీ ఖరారైంది. ఈ నెల 7 నుంచి 23 వరకు 16 రోజుల పాటు బ్రహ్మోత్సవాలకు ఉత్సవ కమిటీని దేవాదాయశాఖ కమిషనర్ అనిల్‌కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. దేవాలయ చైర్మన్‌గా కోర్ని రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలుగా బాలగాని శ్రీనివాస్, కుదురుపాక ఉప్పలయ్య, బందెల సంజీవరెడ్డి, దొంగల జనార్ధన్‌రెడ్డి, భూక్య బక్క, గడ్డెల బిక్షపతి, చిన్నం గణేష్, ప్రొద్దుటూరి సత్యనారాయణ, భూక్య సక్రు, గుగులోతు సోమ్లు, వెంపటి శ్రీను, తెగుళ్ల వెంకటేష్, కాసుల మల్లికార్జున్‌లను నియమించారు. దేవాదాయశాఖ నుంచి నోటిఫికేషన్ వెలువడ్డాక ఇదే కమిటీ అధికారికంగా కొనసాగనుంది.

గులాబీకి ఝలక్..!

(3వ పేజీ తరవాయి)

సిద్ధమవుతుండడం పార్లమెంట్ ఎన్నికల వేళ గులాబీ పార్టీలో కుదుపుగా రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు.

క్యూలో మేయర్ సహా 18 మందికి పైగా కార్పొరేటర్లు..

గులాబీ ఏలుబడిలో ఉన్న వరంగల్ మహానగర పాలిక సైతం హస్తగతం కానుంది. ఇప్పటికే ఏడుగురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు గత నెలలో కాంగ్రెస్ గూటికి చేరుకున్నారు. తాజాగా రాష్ట్ర మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు నేతృత్వంలో పలువురు కార్పొరేటర్లు గులాబీ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరేందుకు హైదరాబాద్‌కు పయనం అయ్యారు. హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కార్పొరేటర్లు హస్తం గూటికి చేరనున్నారు. అయితే పలువురు కార్పొరేటర్లు మంత్రి సురేఖ నేతృత్వంలో కాంగ్రెస్‌లో చేరుతున్న విషయం తెలుసుకున్న మేయర్ గుండు సుధారాణి సైతం తన అనుచర కార్పొరేటర్లతో కలిసి ముఖ్యమంత్రి సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రతిపాదనలు చేసినట్లుగా సమాచారం. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగర పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలను మేయర్ చేరికపై చర్చించినట్లుగా సమాచారం. మేయర్ సుధారాణి చేరికపై కార్పొరేటర్ల నుంచి వ్యతిరేకత వస్తే తప్ప మేయర్‌తో పాటు సుమారు 18 మందికి పైగా కార్పొరేటర్లు రెండు, మూడు రోజుల్లో కాంగ్రెస్‌లో చేరే అవకాశాలు కనిపిస్తున్నా యి. మొత్తానికి వరంగల్ మహానగర పాలిక కూడా హస్తం పాలనలోకి రానుంది. ఇది బీఆర్ఎస్‌కు బిగ్ షాక్‌గా రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. కాగా, ఆదివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డిని మేయర్ సుధారాణి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వరంగల్ నగర అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్టు తెలిపింది. కానీ, ఆమె త్వరలో కాంగ్రెస్‌లో చేరుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

హస్తం గూటికి వర్ధన్నపేట చైర్‌పర్సన్..

వర్ధన్నపేట మునిసిపాలిటీ హస్తగతం అయింది. ఇటీవలే బీఆర్ఎస్‌కు చెందిన మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోత్ అరుణపై పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది. కాగా, ఆదివారం వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు నేతృత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో మునిసిపల్ చైర్‌పర్సన్ అరుణతో పాటు కౌన్సిలర్లు తుమ్మల రవీందర్, మంచాల రామకృష్ణలు కాంగ్రెస్ గూటికి చేరారు. అలాగే వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు సైతం కాంగ్రెస్ గూటికి చేరుతారనే ప్రచారం జరుగుతోంది. ఇటీవల సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిసి వచ్చిన రవీందర్‌రావు పార్టీ మార్పుపై తన అనుచరులతో అంతర్గతంగా చర్చించారు. చాలా మంది కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు మొగ్గు చూపినట్లుగా సమాచారం. అయితే బీఆర్ఎస్ అధిష్ఠానం ఒత్తిడితో చేరిక విషయంలో ఆలస్యం జరుగుతుందని, పార్లమెంట్ ఎన్నికల లోపు రవీందర్‌రావుతో పాటు మరికొంత మంది నేతలు హస్తం గూటికి చేరుతారనే ప్రచారం జరుగుతోంది.

నాల్గవ రోజు మేడారం హుండీల లెక్కింపు

హనుమకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : మేడారం సమ్మక్క సారలమ్మ జాతర హుండీల లెక్కింపు వరుసగా నాల్గవ రోజు ఆదివారం కూడా ప్రశాంతంగా కొనసాగింది. లెక్కింపులో భాగంగా నాల్గవ రోజు 88 హుండీలను తెరిచారు. వీటి ద్వారా రూ.71,67,000 ఆదాయం సమకూరిందని మేడారం సమ్మక్క సాలరమ్మ జాతర ఈవో రాజేంద్రం తెలిపారు. దీంతో గత నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న హుండీల లెక్కింపు ద్వారా మొత్తం ఆదాయం రూ.10,32,03,000 చేరుకున్నది. ఇప్పటి వరకు 405 హుండీలను లెక్కించడం పూర్తయింది. ఇంకా 113 హుండీలను లెక్కించాల్సి ఉంది. వీటిని సోమవారం లోగా లెక్కిస్తారు. ఆదివారం హుండీల్లో నగదు, నాణాలతో పాటు విదేశీ కరెన్సీ, బంగారం వెండి కానుకలు కూడా బయటపడ్డాయి. వెండి, బంగారు కానుకలను ప్రత్యేక హుండీలో భద్రపరుస్తున్నారు.

ఇక్కడంతా వైవిధ్యమే..

- వీరన్న దేవాలయంలో అరుదైన సంప్రదాయం
- శివరాత్రి నుంచి నెలరోజుల పాటు జనజాతర
- మేడారం తర్వాత భారీగా గిరిజన భక్తుల దర్శనాలు
- ఉమ్మడి రాష్ట్రం నుంచి సీఎంల మొక్కులు.. దర్శనాలు

కురవి వీరభద్రుడికి నారికేళాలు.. భద్రకాళి అమ్మవారికి జంతు బలులు



కురవిలో భద్రకాళి సమేత వీరభద్రుడు

మహబూబాబాద్, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : కోరిన వారికి కోటి వరాలిచ్చే దైవంగా విరాజిల్లుతున్న మహబూబాబాద్ జిల్లా కురవిలోని వీరభద్రస్వామి దేవాలయం వైవిధ్యభరితమైన సంప్రదాయాలతో విలసిల్లుతోంది. భద్రకాళి సమేత వీరభద్రుడిగా భక్తుల కోర్కెలు తీర్చే దైవాలుగా, ఏటేటా మహాశివ రాత్రి నుంచి నెల రోజుల పాటు నిర్వహించుకునే జాతర ఉగాది పర్వదినంతో ముగుస్తుంది. ఈ ఆలయ ప్రాంగణంలో శ్రీవారైనా వీరభద్రుడికి మాత్రం నారికేళ (కొబ్బరికాయ)లు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం అనవాయితీ. ఆలయానికి వెలుపల నిర్మించిన ప్రహరీ వెలుపల భద్రకాళి అమ్మవారికి జంతు (కోళ్లు, యాటపోతుల) బలులతో మొక్కులు తీర్చుకోవడం అనాదిగా వస్తోంది. నెలరోజుల పాటు కొనసాగే ఈ జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా తరలివచ్చే భక్తజనం మొక్కులు కూడా వైవిధ్యంగానే ఉంటాయనడానికి ఈ ఆలయమే నిదర్శనం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ముఖ్యమంత్రులుగా కొనసాగిన నారా చంద్రబాబునాయుడు, దివంగత వైఎ్‌స.రాజశేఖర్‌రెడ్డిలతో పాటు తెలంగాణ రాష్ట్రం సిద్ధిస్తే బంగారు మీసాలు సమర్పిస్తానని మొక్కుకున్న పూర్వ సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఈ ఆలయాన్ని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు విడతల వారీగా మంజూరు చేశారు.

చరిత్ర పుటల్లో కురవి వీరన్న..

ప్రాచీనాంధ్ర చరిత్రలో కాకతీయ ప్రభులది ప్రత్యేక స్థానం ఉందనడంలో అతిశయోక్తి లేదు. కాకతీయుల సామ్రాజ్యం అత్యంత వైభవంగా వెలుగొందిన 12వ శతాబ్దంలో కాకతీయుల కళాపిపాసకు, కళల పోషణ అభిరుచికి ఉమ్మడి వరంగల్ జిల్లాలోని రామప్ప దేవాలయం, వేయి స్తంభాల గుడి, ఇలాంటి దేవాలయాలు నిదర్శనాలుగా నిలుస్తాయి. ఈ కోవలోనిదే.. ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయం. పుణ్యక్షేత్రాలతో విలసిల్లుతూ.. ఈ మండలం చారిత్రక పర్యాటక ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ఈ కురవి ఆలయాన్ని దర్శించుకోవడానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తులు ప్రతీ సంవత్సరం తరలివస్తున్నారు. సికింద్రాబాద్, విజయవాడ రైల్వే సెక్షన్‌లో ఉన్న మహబూబాబాద్ రైల్వేస్టేషన్‌కు తొమ్మిది కిలోమీటర్ల దూరంలో కురవి ఉంది.

చారిత్రక ప్రాధాన్యంతో కురవి..

కురవి ఒకప్పుడు మహోన్నత దశను అందుకున్న నగరంగా పేరుగడించింది. క్రీ.శ 850 ప్రాంతంలో తూర్పు చాళుక్యులతో ముఖ్యుడైన గునగ విజయాదిత్యుడు వేంగి (ఏలూరు)ను రాజధానిగా చేసుకుని పరిపాలించాడు. వేంగి చాళుక్యుల కాలంలో చోళరాజులతో సత్సంబంధాలు, బంధుత్వాలు ఏర్పడ్డాయని చెబుతారు. ఇందుకు నిదర్శనంగానే రాజరాజ చోళని కుమార్తెను రాజమహేంద్రవరాన్ని ఏలుతున్న విమలాదిత్యుడు వివాహం చేసుకున్నట్టు చరిత్ర చెబుతోంది. సదరు విమలాదిత్యుడు కుమారుడే రాజరాజ నరేంద్రుడు ఆ కాలంలో తమిళ దేశపు ద్రావిడ సంస్కృతిని ప్రతిబింబించే విశిష్టాద్వైత ప్రబంధాలు వ్యాస భారతాన్ని ఆదికవి నన్నయ్య ఆంధ్రీకరించాడు. ఈ నేపథ్యంలోనే అనేక తెలుగు కుటుంబాలు తమిళ దేశానికి తరలివెళ్లాయి. అప్పట్లోనే వేంగి రాజధానిగా ఆంధ్రదేశాన్ని పరిపాలించే రోజులలో రాష్ట్ర కూటులచే పరాజితుడైన భీమ రాజు ప్రస్తుత ఈ కురవి నగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించాడు. ఆ కాలంలోనే శ్రీవీరభద్రేశ్వరి కురవి ఆలయాన్ని నిర్మించినట్లు శిలాశాసనాల ద్వార తెలుస్తోంది. నాటి వేంగి చాళుక్యుల అనంతరం ఈ దేవస్థానాన్ని కాకతీయ తొలి స్వతంత్ర రాజైన 1వ బేత రాజు పునరుద్ధరించారు. తరువాత కాలంలో రెండో బేతరాజు కురవి చెరువును తవ్వించినట్లు అనేక ఆధారాలున్నాయి. తూర్పు చాళుక్య రాజైన శ్రీవీరభద్రుని వివాహమాడిన కాకతీయ సామ్రాజ్ఞి రుద్రమదేవి ఈ కురవి దేవాలయాన్ని సందర్శించినట్లు విదేశీ యాత్రికుడు మార్కోపోలో తన రచనల్లో పేర్కొన్నాడు. శ్రీవీరభద్రుడి దేవాలయం చుట్టూ కురవి పట్టణ ప్రాంతం ఏర్పడినట్లు వేంగి చాళుక్యుల రెండో రాజధాని నగరంగా మహోన్నత శిఖరాలు అధిరోహించి, సాహితీ సాంస్కృతిక రంగాలలో ఎనలేని వైభవాన్ని చవి చూసినట్లు చరిత్ర వల్ల తెలుస్తోంది.

శివరాత్రి నుంచి ఉగాది వరకు..

భద్రకాళి సమేత శ్రీవీరభద్రస్వామి కురవి జాతర ఏటేటా మహాశివరాత్రి రోజున ఆరంభమై నెలరోజుల పాటు కొనసాగి, ఉగాది పర్వదినంతో ముగుస్తుంది. ఈ కాలంలో వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుంటారు. శివరాత్రి పర్వదినం వెళ్లిన తెల్లవారుజామున శ్రీవీరభద్రేశ్వరుడి కల్యాణం భద్రకాళి అమ్మవారితో జరుగుతుంది. స్వామిని కొలిచే భక్తుల్లో ఎక్కువగా బంజార గిరిజన లంబాడాలే ఉండడం విశేషం. జాతర సందర్భంగా మహబూబాబాద్ జిల్లా అధికార యంత్రాంగం దేవాదాయశాఖ అధికారులు భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తారు. శివరాత్రికి వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సులను నడుపుతుంది.



వీరభద్రుడి సన్నిధిలో నారికేళాలు సమర్పించుకుంటున్న భక్తులు



మహబూబాబాద్ జిల్లా కురవి దేవాలయం

తొలుత స్వామి ఒక్కడే.. ఆపై

కురవిలో తొలుత వీరభద్రస్వామి ఒక్కరే ఉండేవారని, సుమారు 150 ఏళ్ల కిందట భక్తులు తాము చేసిన తప్పొప్పులను ఆలయ ప్రాంగణంలోకి రాగానే వీరభద్రుడే పూనకాల ద్వారా భక్తుడి నోటివెంట నిజాలు చెప్పించేవారని నమ్మకాలు ఉండేవని చెబుతున్నారు. దీంతో అనేక కుటుంబాలు విడిపోవడం లాంటి అనర్థాలు జరిగాయట. ఆ క్రమంలోనే ఉగ్రరూపుడైన వీరభద్రుడి రౌద్రాన్ని తగ్గించడానికి అమ్మవారిని తీసుకురావాలనే ఆలోచన భక్తులకు కలిగిందట! ఫలితంగా భద్రకాళి అమ్మవారి విగ్రహాన్ని తీసుకువచ్చి ఇదే ఆలయంలో వీరభద్రుడి పక్కన ప్రతిష్ఠించారని ప్రతీతి. అప్పట్నుంచి ప్రతీ శివరాత్రి ఈ ఇరువురికి కల్యాణం జరుగుతోంది. అయితే తనకు నారికేళాలు కాదని, బలులు కావాలని, ప్రత్యేక ఆలయం కట్టించాలని ఓ భక్తుడి కలలో అమ్మవారు కన్పించి కోరిందంట.. ఆపై వీరభద్రుడి ఆలయానికి సమీపంలోనే ప్రత్యేకంగా భద్రకాళి ఆలయాన్ని నిర్మించారు. ఈ అమ్మవారు స్వయంభూ అవతారమన్న వాదన కూడా ఉంది. ఏదేమైనా అప్పట్నుంచే ఇటు వీరభద్రుడికి నారికేళాలు సమర్పించుకునే భక్తులు, భద్రకాళి అమ్మవారి ప్రత్యేక ఆలయంలో జంతుబలులు ఇస్తూ వస్తున్నారు.

హక్కుల పోరాట యోధుడు 'నల్లెల'

సంతాప సభలో వక్తల నివాళి



నల్లెల రాజయ్యకు నివాళులర్పిస్తున్న ప్రముఖులు

హనుమకొండ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమ కారుడు, పర్యావరణ ప్రేమికుడు, పౌర స్పందన వేదిక బాధ్యుడు, దివ్యాంగుల హక్కుల నాయకుడిగా నల్లెల రాజయ్య చేసిన కృషి ఎనలేనిదని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆడిటోరియంలో దివ్యాంగ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘం, ఉమ్మడి వరంగల్ దివ్యాంగ సంస్థల ఆధ్వర్యంలో నల్లెల రాజయ్య సంతాప సభ ఘనంగా జరిగింది. ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బిల్ల మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో ముందుగా రాజయ్య చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సమాజంలోని ప్రతీ పోరాటంలో, ప్రతీ ఉద్యమంలో మమేకమైన ఒకే వ్యక్తి రాజయ్య అన్నారు. మలిదశ ఉద్యమ పోరాటంలో అందరితో పాటు సమూహమై తిరిగి ఉద్యమంలో వలసదారుల ఆధిపత్యంపై నిప్పులు కురిపించారన్నారు. వరంగల్ రచయితల సంఘాన్ని ఏర్పాటు చేసి ఆ సంస్థ ద్వారా అనేక పోరాటాలను నడిపించడంతో పాటు 20కిపైగా సంఘాలతో సాహిత్య సంపదను తీసుకువచ్చారన్నారు. దివ్యాంగుల హక్కులపై నిరంతరం గొంతెత్తాడని, దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకుడిగా అనేక విధాలుగా పోరాటాలు కొనసాగించాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్, ఆర్ట్స్ కళాశాల ప్రొఫెసర్ బన్నా ఐలయ్య, దివ్యాంగ ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే హబీబ్ మియా, లక్ష్మయ్య, బోనగిరి రాములు, డాక్టర్ లక్కిరె డ్డి సత్యం, శంకర్ నాయక్, తిరుపతి, పొట్లపల్లి శ్రీనివాసరావు, అనిశెట్టి రజిత, రామలక్ష్మి, డబ్ల్యూవో కె మధురిమ, మెప్మా ఎండీ అంబటి రాజేందర్, ఎన్‌టీడీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ అజీమ్, పౌర స్పందన వేదిక అధ్యక్షుడు కె శంకర్ రావు, పింగిళి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్యామల, తెరవే రాష్ట్ర కార్యదర్శి జోగు అంజయ్య, ఆత్మకూరి రామకృష్ణ, వల్లపురెడ్డి వాసుదేవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన డాగ్ షో



కాళోజీ జంక్షన్, మార్చి 3 : కాకతీయ కెన్నెల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ పాఠశాలలో నిర్వహించిన అంతర్జాతీయ డాగ్ షో చూపరులను ఎంతగానో అలరించింది. డాగ్ షోలో తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 35 రకాల జాతులకు చెందిన శునకాలను డాగ్ షోలో ప్రదర్శించడానికి తీసుకొచ్చారు. పది రౌండ్లు నిర్వహించిన పోటీల్లో శునకాలు, వాటి యజమానులు ఉత్సాహంగా ఉల్లాసంగా పాల్గొన్నారు. వరంగల్ నగరం నుంచి అధిక సంఖ్యలో పాల్గొన్నాయి. బహుమతులు గెలుచుకున్న శునకాలకు నిర్వాహకులు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు. డాగ్ షో నిర్వాహ కులు వి.రమణారెడ్డి, కె.రామస్వామి, డాక్టర్ ప్రదీప్‌రెడ్డి పాల్గొన్నారు.



కొలువుదీరిన దామేశ్వరుడు

ఘనంగా శివలింగ ప్రతిష్ఠాపనోత్సవం



యాగశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

దామెర, మార్చి 3: దామెర మండల కేంద్రంలో ప్రాచీన శివాలయం(దామేశ్వరాలయం)లో మూడు రోజుల పాటు నిర్వహించిన పునఃప్రతిష్ఠాపనోత్సవాలు వైభవోపేతంగా జరిపించారు. అనంతరం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో వేద పండితుల వేద మంత్రాల నడుమ పూర్ణాహుతి క్రతువును పూర్తి చేశారు. గన్నవరం భువనేశ్వరీ పీఠాధీశ్వరులు కమలానంద భారతీ స్వామి అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా జరిగిన పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవంలో అమ్మవార్లకు మంగళసూత్రంతో పాటు మెట్టెలను కోట రాంరెడ్డి దంపతులు బహూకరించారు. ఈ సందర్భంగా శివం టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ బిల్లా రమణారెడ్డి దంపతులు, ముద్దసాని సహోదర్‌రెడ్డి, చందుపట్ల సత్యవర్ధన్‌రెడ్డి, గంగిడి శ్రీధర్‌రెడ్డి, పోలం కృపాకర్‌రెడ్డి, గురిజాల శ్రీరాంరెడ్డి, పోల్సాని అనిల్‌రెడ్డి, వద్దిరాజు సత్యనారాయణరెడ్డి, గరిగె కల్పనకృష్ణమూర్తి, దామెరుప్పుల శంకర్, మేరుగు కుమారస్వామి, గడ్డం సదానందం, గంగిడి రాజేందర్‌రెడ్డి, సండెసారి సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

దర్శించుకున్న పలువురు ప్రముఖులు

దామేశ్వరాలయం(శివాలయం)లో ఆదివారం శివలింగ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనోత్సవాలు ఎంతో వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా స్వామివారికి యాగశాలలో నిర్వహించిన ప్రత్యేక పూజాదికాల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన వెంట దామెర మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, సీనియర్ జిల్లా నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పోలెపాక శ్రీనివాస్, సదిరం పోచయ్య, హింగె నాగేశ్వర్ రావు, దురిశెట్టి భిక్షపతి, శనిగరం సుధాకర్, నల్ల సుధాకర్ ఉన్నారు. పునఃప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించినవారిలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి, బీజేపీ జాతీయ నాయకుడు వంగాల సమ్మిరెడ్డి, రాష్ట్ర నాయకులు మంద ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సతీమణి నీలిమ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్(డీడీవోపీ) సత్యనారాయణ, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ మల్లాడి శ్రీరాంరెడ్డి, సంఘ్ సంచాలక్ పోల్సాని శ్రీనివా స్‌రెడ్డి, మధుకర్ రెడ్డి, ప్రముఖ న్యాయవాదులు వద్దిరాజు వెంకటేశ్వర్ రావు, గణేష్, లంక రాజారాంరెడ్డి హాజరయ్యారు.

నాటక రంగాన్ని బతికించాలి..

టీవీ, సినిమా మోజులో పడిన జనం..

డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

ఘనంగా ప్రారంభమైన నాటక పోటీలు

వర్ధన్నపేట, మార్చి 3 : భారతీయ సాంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించి, నాటక రంగంగాన్ని బతికించి, భావితరాలకు అందించాల్సిన గురుతర బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని వరంగల్ నగర మాజీ మేయర్, డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. ఆదివారం రాత్రి వర్ధన్నపేటలో భారతీయ నాటక కళాసమితి ఆధ్వర్యంలో 50వ ఉభయ రాష్ట్రాల ఆహ్వాన నాటక పోటీల ప్రారంభోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కళాసమితి అధ్యక్షుడు గాడిపెల్లి రాజేశ్వర్‌రావు అధ్యక్షత జరిగిన వేడుకల్లో ముఖ్యఅతిథి స్వర్ణ మాట్లాడుతూ పూర్వం నాటికలకు ఆదరణ లభించేదని, ప్రస్తుతం సినిమాలు, టీవీ మోజులో పడి నాటక రంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. సామాజిక రుగ్మతలు, సాంఘిక దురాచారాలను రూపుమాపేలా ఇతివృత్తాలను ప్రోత్సహించి ప్రజల్లో చైతన్యం తీసుకురావానికి అహర్నిశలను కృషి చేస్తున్న భారతీయ కళాసమితి సేవలు ప్రశంసనీయమన్నారు. అంచెలంచెలుగా ఎదిగి స్వర్ణోత్సవాలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. నాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని కోరారు. ఎంపీపీ అప్పారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో అంచెలంచెలుగా ఎదిగి 50వ ఉభయ రాష్ట్రాల పరిధిలో నాటికలను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. కళలను ప్రోత్సహించి విదేశీ సంస్కృతిని పారద్రోలాల్సిన అవసరం ఉందన్నారు. నాటక ప్రారంభోత్సవానికి ముందు చిన్నారులు ప్రదర్శించిన నృత్యం అందరిని ఎంతగానో అలరించింది.

పట్టణంలో శోభాయాత్ర..

వర్ధన్నపేట పట్టణంలో ఆదివారం రాత్రి భారతీయ నాటక కళాసమితి ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల నాటక పోటీలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి అంబేద్కర్ సెంటర్ నుంచి నాటక కళా సమితి వరకు కళాకారులతో శోభయాత్ర నిర్వహించారు. శోభయాత్ర అందరిని అలరింపజేసింది. అనంతరం భారతీయ నాటక కళా సమితి ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి నాటక పోటీలు ఆదివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.



నాటకోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ

ఆకట్టుకున్న నాటికలు..

తొలి రోజు ఆదివారం రెండు నాటక ప్రదర్శనలు నిర్వహించగా ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మొదట తెలుగు కళా సమితి విశాఖపట్టణం వారి నిశ్శబ్దమా- నీ ఖరీదెంత నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకంలో.. అనాదిగా కుటుంబ వ్యవస్థను మెరుగుపరుద్దామని చట్టంలో కొన్ని మార్పులు చేస్తున్నారు. ఆ మార్పులు, కష్టాలను, కన్నీళ్లను అనుభవిస్తున్న వాళ్లకు ఎంత వరకు ఉపశమనం కలిగిస్తుందో తెలియదుగానీ కొందరు ఇచ్చిన తప్పుడు రిపోర్టు కారణంగా కత్తి కన్నా పదునైన చట్టాన్ని దుర్వినియోగపర్చడం జరుగుతోందని ఈ నటకంలో కళ్లకు కట్టినట్టు రక్తికట్టించారు. వామన్‌రావుగా జి.కన్నబాబు, కుమార్‌గా వరప్రసాద్, పల్లవిగా డి.హేమ, ఎస్ఐ పాపారావుగా బీవీ.ప్రసాద్‌రావు, హెడ్ కానిస్టేబుల్ వెంకటరావుగా ఇ.రాంబాబు, అనూరాధగా లాస్య తమ పాత్రలకు తమ అద్భుత నటనతో ఆకట్టుకున్నారు.

రెండో నాటిక కళానికేతన్ వీరన్నపాలెం వారు ప్రదర్శించిన రాజు గారి గోచి నాటకం విశేషంగా ఆకట్టుకుంది. కథలోకి వెళ్తే.. ఓ చిన్న దీవి. జనాభా కేవలం ఆరువేలు. వారి నుంచి పన్నులు పిండే పాలకులు సరదాలకు చాలక పేదల శ్రమని దోచుకునేందుకు జూదశాలను ఏర్పాటు చేస్తారు. దాని వల్ల ఓ హత్య జరుగుతుంది. హంతకుడికి రాజు ఉరి శిక్ష వేస్తాడు. ఉరిని అమలు చేయలేక దానిని జైలుశిక్షగా మారుస్తారు. వాడికి ముప్పూటు భోజనం, కాపల భటుడు, ఆ చిన్న ఆర్థిక వ్యవస్థకు పెనుభారంగా మారుతుంది. అంతర్లీనంగా రాజుని, పాలనను ఎలాగైన దారినపెట్టేందుకు చేసే ప్రయత్నమే ఈ కథ. నేర విచారణ, నేరస్తుడికి శిక్ష కంటే కూడా నేరం వల్ల అనాథలైన బాధితుల్ని ఆదుకోవడం ముఖ్యమని చెప్పడమే ఈ నాటకం ఉద్దేశం. పాత్రధారులు తమ పరిధి మేరకు చక్కగా నటించి విశేషంగా ఆకట్టుకున్నారు.

ఊరూరా పల్స్ పోలియో

వాజేడు, మార్చి 3: మండలంలో పల్స్ పోలియో కార్యక్రమంలో విజయవంతమైంది. వాజేడు, పేరూరు పీహెచ్‌సీల పరిధిలో 52 కేంద్రాలను ఏర్పాటు చేసి పోలియో చుక్కలు వేశారు. ఎంఎల్‌హెచ్‌పీ వైద్యురాలు జ్ఞానస, సీహెచ్‌వో సూర్యప్రకాశరావు, హెచ్ఎస్ కోటిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీప్రాంతంలో గుట్టలపై నివాసం ఉంటున్న పెనుగోలు గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోయినప్పటికీ ఉద్యోగులు సుమారు 32 కిలోమీటర్లు వెళ్లారు. అక్కడ ఇద్దరు పిల్లలు మాత్రమే ఉన్నా మూడు గుట్టలు, మూడు వాగులు దాటుకుంటూ వెళ్లి పోలియో చుక్కలు వేశారు. హెల్త్ అసిస్టెంట్ చిన్నవెంకటేశ్వర్లు, ల్యాబ్‌టెక్నీషియన్ లఖన్ పాల్గొన్నారు.


వాజేడు మండలం పెనుగోలులో పోలియో చుక్కలు వేస్తున్న వైద్య సిబ్బంది

● మల్హర్: మండలంలో వైద్యాధికారి రాజు ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కార్యక్రమం జరిగింది. 22 బూత్‌ల ద్వారా 1550 మంది చిన్నారులకు ఽపోలియో చుక్కలు వేశారు. కొయ్యూర్, ఎడ్లపల్లి, రుద్రారంలో సాగుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని డీఐవో అన్వేషణ పరిశీలించారు. మండల కేంద్రమైన తాడిచర్లలో ఎంపీపీ చింతలపల్లి మల్హర్‌రావు ప్రారంభించారు.

● గోవిందరావుపేట: మండలంలోని పస్రా గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ సూడి శ్రీనివాసరెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు.

● రేగొండ: రేగొండ, గోరికొత్తపల్లి మండలాలలోని గ్రామాల్లో జరిగిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ పున్నం లక్ష్మి ప్రారంభించారు. రెండు మండలాల్లోని మొత్తం 37 కేంద్రాల్లో పోలియో వ్యాక్సిన్ వేసినట్లు వైద్యాధికారి హిమబిందు తెలిపారు.

● కన్నాయిగూడెం: మండల కేంద్రంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ జనగాం సమ్మక్క ప్రారంభించారు. మొత్తం 1,610 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు మెడికల్ ఆఫీసర్ అభినవ్ తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ తిరుపతయ్య, హెల్త్ సూపర్‌వైజర్ రమణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

● కాటారం : మండలంలో 35 బూత్‌లు, ఒక మొబైల్ బూత్ ద్వారా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మౌనిక తెలిపారు. మొత్తం పిల్లలు 3,226 మంది ఉండగా 3,198 మందికి చుక్కలు వేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● తాడ్వాయి : మండలంలో 1,048 మంది చిన్నారులకు చుక్కల మందు వేసినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రణధీర్ తెలిపారు.ఈ కార్యక్ర మంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

● మొగుళ్లపల్లి: మండలకేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో ఎంపీపీ యార సుజాత, జడ్పీటీసీ సదయ్య, పీహెచ్‌సీ వైద్యురాలు నాగరాణి పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ప్రారంభిం చారు. మండలంలో 30 పల్స్‌పోలియో కేంద్రాలను ఏర్పాటుచేసి 3,270 మంది చిన్నారులకు చుక్కలు వేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో పల్లె దవాఖాన వైద్యులు వాణి, స్వప్న, అశ్విని, సంధ్యారాణి, విద్యాసాగర్, సరళ, హెల్త్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

● వెంకటాపూర్(రామప్ప): మండలకేంద్రంలో ఏర్పాటుచేసిన పల్స్‌పోలియో కార్యక్రమాన్ని ఎంపీటీసీ పోశాల అనిత వీరమల్లు ప్రారంభించారు. మండలంలో 31 కేంద్రాలను ఏర్పాటుచేసి 2193మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి శ్రీకాంత్ తెలిపారు. సీహెచ్‌వో సదానందం, హెచ్‌వీ పుష్పకుమారి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

● గణపురం: మండలంలో 28 కేంద్రాలుగా ఏర్పాటు చేసి పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. గణపురం పీహెచ్‌సీ వైద్యురాలు అనూష, చెల్పూరు పీహెచ్‌సీ వైద్యురాలు స్వాతి పాల్గొన్నారు.

● మహదేవపూర్: కాళేశ్వరం పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం అయినట్లు వైద్యురాలు డాక్టర్ తోరె సుస్మిత తెలిపారు. 22 బూత్‌ల ద్వారా సుమారు 2 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వివరించారు.

● టేకుమట్ల: మండలంలోని రామక్రిష్టాపూర్(వి) గ్రామంలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఎంపీపీ రెడ్డిమల్లారెడ్డి ప్రారంభించారు. మెడికల్ ఆఫీసర్ ఆశాజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు జడ్పీటీసీ రాజీనామా



టేకుమట్ల, మార్చి 3: టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి బీఆర్ఎస్‌కు రాజీనామా చేశారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతికి రాజీనామా లేఖను వాట్సాప్ ద్వారా ఆదివారం పంపానని తెలిపారు. ప్రజలు తనపై నమ్మకంతో జడ్పీటీసీగా అవకాశం కల్పించారని, నాలుగేళ్ల పదవి కాలంలో వారికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. బీఆర్ఎస్‌ను వీడుతున్న తాను కాంగ్రెస్‌లో చేరి ఎమ్మెల్యే గండ్ర సత్యనారయణరావు సహకారంతో టేకుమట్ల మండలాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ వరంగల్ ఎంపీ టికెట్ దొమ్మాటి సాంబయ్యకు ఖరారు రావడంతో బీఆర్ఎస్‌ను వీడుతు న్నానని పేర్కొన్నారు. ఆయన గెలుపునకు కృషి చేసి మండలాన్ని మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.

జూనియర్ ఫారెస్ట్ ఎంప్లాయిస్ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



కాకతీయఖని, మార్చి 3: తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడిగా బి.శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. భూపాలపల్లిలోని అటవీశాఖ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఈ ఎన్నికలు జరిగాయి. తన సమీప ప్రత్యర్థిపై 40ఓట్ల తేడాతో శ్రీనివాస్ విజయం సాధించారు. ఉపాధ్యాక్షుడిగా రాజు, జనరల్ సెక్రటరీగా ఆనంద్, ఆర్గనైజేషన్ సెక్రటరీగా ఇబ్రహీం, జాయింట్ సెక్రటరీగా విఠల్, కోశాధికారిగా వరుణ్ ఎన్నికయ్యారు.

కాంగ్రెస్‌లోకి పీఏసీఎస్ వైస్ చైర్మన్

మరికొందరు బీఆర్ఎస్ నేతలు కూడా..

మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో చేరిక


కాంగ్రెస్‌లో చేరిన వారితో మంత్రి శ్రీధర్‌బాబు

కాటారం, మార్చి 3: గారెపల్లి(కే) ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్ చైర్మన్ దబ్బెట స్వామితోపాటు డీసీఎంఎస్ మాజీ వైస్ చైర్మన్ దబ్బెట రాజేషం, ఇబ్రహీంపల్లి తాజా మాజీ సర్పంచ్ దబ్బెట సరోజన, ఉప సర్పంచ్ కొత్తపల్లి శేఖర్ తదితర బీఆర్ఎస్ నేతలు ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమక్షంలో హైదరాబాద్‌లో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.వారికి మంత్రి కాంగ్రెస్ కండు వాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో కాటారపు శంకరయ్య, రాజు, మొండయ్య, శ్రీధర్, వెంకటేష్, రవి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ చీమల సత్యం, కాటారం మాజీ ఉప సర్పంచ్ నాయిని శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు కుంభం రమేష్‌రెడ్డి, చాంద్‌పాషా, కలీం, బాపు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సేవాలాల్ జయంతి

కాటారం, మార్చి 3: బంజారా సేవా సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ అవరణలో ఆదివారం ఘనం గా నిర్వహించారు. సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. బోగ్ భండారో, జగదాంబమాత పూజలు నిర్వహించారు. సంత్ సేవాలాల్ ఆశయాలను ఆచరించాలని బంజారా సేవా సంఘం మండల అధ్యక్షుడు లావుడ్యా రమేష్‌నాయక్ అన్నారు. బంజారా సేవా సంఘం ప్రతినిధులు ఆరోగ్యనా యక్, ప్రతాప్‌నాయక్, రమేష్‌నాయక్, లక్ష్మణ్ నాయక్, సమ్మయ్యనాయక్, రాములు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


దగ్ధమవుతున్న ఇల్లు

మంగపేట, మార్చి 3: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని నర్సింహసాగర్ గ్రామ పంచాయతీ పరిధి శనిగకుంట గిరిజన గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రజిత, దేవందర్ దంపతుల ఇంట్లో మధ్యాహ్నం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించి మంటలు చెలరేగాయి. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంటి బయటు ఉన్నారు. ఒక్కసారిగా పొగలు వస్తుండటాన్ని గమనించగా చూస్తూ చూస్తుండగానే ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో విలువైన వస్తువులు, నిత్యావసర సరుకులు, ధాన్యం దగ్ధమై సుమారు రూ. 2 లక్షల నష్టం వాటిల్లింది. ఇల్లు కాలిపోవడంతో కట్టుబట్టలతో నిరాశ్రయులయ్యామని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత దంపతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ధ్యేయం

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


జీరో కరెంట్ బిల్ రశీదును అందిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

గణపురం, మార్చి 3: పేదల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గృహజ్యోతి పథకం లబ్ధిదారులకు విద్యుత్ జీరో బిల్లు రశీదును ఆయన అందజేశారు. మండలంలోని చెల్పూరు గ్రామ పంచాయతీలో ఈ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేస్తామన్నారు. 200యూనిట్ల వరకు కరెంట్ బిల్ కట్టాల్సిన అవసరం లేదని, ఈ పథకం నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. త్వరలో నిరుపేదలు పక్కా ఇళ్లు నిర్మించుకునేలా ప్రణాళిక చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కావటి రజిత, వైస్ ఎంపీపీ అశోక్, కోఆప్షన్ సభ్యుడు ఛోటేమియా, మాజీ సర్పంచ్ కొత్త పద్మ వెంకన్న, పీఏసీఎస్ డైరెక్టర్ కావటి రవి, మాజీ పీఏసీఎస్ తిరుపతిగౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ్ కుటుంబానికి పరిహారం అందించాలి : బీజేపీ

ములుగు కలెక్టరేట్, మార్చి 3: వెంకటాపూర్(రామప్ప) మండలంలోని జవహర్‌నగర్ టోల్‌ప్లాజా పైనుంచి పడి మృతి చెందిన ఉద్యోగి సంగు కల్యాణ్ కుటుంబానికి రూ.50లక్షల పరిహారం అందించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం డిమాండ్ చేశారు. ములుగులోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గాధం కుమార్ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో బలరాం మాట్లాడారు. ములుగు మండలం ఇంచర్ల గ్రామానికి చెందిన కల్యాణ్ పేద కుటుంబంలో జన్మించి టోల్‌ప్లాజాలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడని, ఆయన మృతిపై ఎస్పీ విచారణ చేపట్టి ప్రమాదానికి కారణాలను విచారించి బాధితులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. టోల్‌ప్లాజా యాజమాన్యం నుంచి బాధిత కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు కొత్త సురేందర్, జాడి రామరాజు, శీలమంతుల రవీంద్రాచారి, చల్లూరి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య


రాజలింగు (ఫైల్)

మొగుళ్లపల్లి, మార్చి 3: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై మాధవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పర్లపల్లి గ్రామానికి చెందిన మేడిపల్లి రాజలింగు (53) తనకున్న ఎకరం భూమిలో వరి పంట వేశాడు. పంట సరిగా పండక అప్పులు పెరిగి ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో మనస్తాపం చెందిన రాజలింగు ఫిబ్రవరి 28న తన వ్యవసాయ భూమి వద్ద పురుగుల మందు తాగాడు. దీంతో అతడిని కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందుతున్న క్రమంలో అతడు శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య రాజేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై వివరించారు.

రామప్పలో సండే సందడి


రామప్ప దేవాలయంలో పర్యాటకులు

వెంకటాపూర్(రామప్ప), మార్చి 3: పాలంపేట గ్రామంలోని ప్రఖ్యాత రామప్ప దేవాలయంలో సందడి నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు, విద్యార్థులు, భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అర్చకుల నుంచి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ తూర్పుముఖ ద్వారంలో ఉన్న నందీశ్వరుడిని దర్శించుకుని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి చరిత్ర, విశిష్టత గురించి అడిగి తెలుసుకున్నారు.

కస్తూర్బా ఎస్‌వోకు సత్కారం



ఎస్‌వో సునీతను సత్కరిస్తున్న జడ్జి సరళరేఖ, నిర్వాహకులు

కాటారం, మార్చి 3: కాటారం కస్తూర్బా విద్యాలయం స్పెషల్ ఆఫీసర్ చల్ల సునీతా సంపత్‌ను ఉదయ సాహితి సాహిత్య వికాస వేదిక నిర్వహకులు ఆదివారం సత్కరించారు. కరీంనగర్‌లోని ఓ కళాశాల ఆవరణలో నిర్వహించిన జాతీయస్థాయి మహిళా కవి సమ్మేళనంలో పాల్గొన్న సునీత కవితాగానం చేశారు. దీంతో ఉదయ సాహితి వికాస వేదిక నిర్వాహకులు, కరీంనగర్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి సరళారేఖ, ఎర్రం రాజారెడ్డి, దాస్యం లక్ష్మయ్య, రేళ్ల సంజీవ్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థికి సన్మానం

మల్హర్, మార్చి 3: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబర్చిన తాడిచర్ల గ్రామానికి చెందిన ఇందారపు సాత్విక్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఆదివారం సన్మానించారు. రాష్ట్ర స్థాయి ఉపన్యాస పోటీల్లో ప్రతిభ కనవర్చిన సాత్విక్ మంథనిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో తొమ్మిదో తరగతి చదవుతున్నాడు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబర్చడం పట్ల తల్లిదండ్రులు లావణ్య, రవికుమార్‌తో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కేసారపు నరేష్, చంద్రయ్య, తాండ్ర దినేష్, ఇందారపు సిద్దు, ఇందారపు రవి, శశి, శ్రీనివాస్, గణేష్, ఆది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

జాతీయ సేవారత్న అవార్డు ప్రదానం



నవీన్‌రావుకు అవార్డు అందిస్తున్న నిర్వాహకులు

కాటారం, మార్చి 3: మండలంలోని రేగులగూడెం గ్రామ పంచాయతీలోని దేవరాంపల్లికి చెందిన మాజీ సర్పంచ్ అయిలినేని నవీన్‌రావుకు బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) జాతీయ సేవా రత్న అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాద్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ప్రతి ఏటా ప్రజా ఉద్యమకారులు, సంఘసేవకులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు అందిస్తున్నట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. సేవారత్న అవార్డు అందుకున్న నవీన్‌రావును పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్, రాష్ట్ర కోఆర్డినేటర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సర్వే మజ్దూర్ అర్హత పరీక్షకు 171 మంది హాజరు

కాకతీయఖని, మార్చి 3: సింగరేణి భూపాలపల్లి ఏరియాలో సర్వే మజ్దూర్ అర్హత పరీక్ష నిర్వహించగా 171 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఏరియాలో సర్వే మజ్దూర్ (కేటగిరీ-1) పోస్టులు 12 ఖాళీ ఉండగా ఆదివారం పట్టణంలోని సింగరేణి పాఠశాలలో పరీక్ష నిర్వహించారు. 204 మంది అభ్యర్థులకు హాల్ టికెట్ మంజూరు కాగా 171 మంది పరీక్ష రాశారు. ఈ పరీక్ష కోసం రెండు ప్రశ్న పత్రాలను తయారు చేశామని, అందులో ఒక సెట్‌ను డ్రా పద్ధతిలో ఎంపిక చేశామని ఏరియా ఇన్‌చార్జి జీఎం బండి వెంకటయ్య తెలిపారు.

'బుగ్గు రవ్వలు' ఆవిష్కరణ


బొగ్గురవ్వలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆయా సంఘాల నాయకులు

కాకతీయఖని, మార్చి 3: తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో 'బొగ్గు రవ్వలు' పుస్తక ఆవిష్కరణ జరిగింది. భూపాలపల్లి పట్టణంలోని బాతాల రాజ్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు రత్నం కిరణ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథులుగా టీఎస్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గట్టయ్య, సీనియర్ జర్నలిస్ట్ రమణాచారి, ఓయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ జానకీరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత గురిజాల రవీందర్ మాట్లాడుతూ సింగరేణి హక్కుల సాధన, ఉద్యమ నేపథ్యాన్ని అక్షరబద్ధం చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్ధన్, రాజన్న, సత్యం, కుమారస్వామి, శీధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మెపా చేయూత


పవన్ కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న మెపా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్

గణపురం, మార్చి 3: మండలంలోని కొండాపూర్ గ్రామ పంచాయతీలో ప్రమాదవశాత్తు మృతిచెందిన మామిడి పవన్ ముదిరాజ్ కుటుంబ సభ్యులను మెపా (ముదిరాజ్ ఎంప్లాయిస్, అండ్ ప్రొఫేషనల్ అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు కొత్తగట్టు శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. రూ. 41వేలను ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మొగిలి, జిల్లా అధ్యక్షుడు పుట్ట తిరుపతి, ప్రధాన కార్యదర్శి రమేష్, జోడు ప్రదీప్, కృష్ణస్వామి, రవి, స్వామి, రవి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలి

గ్రామాల్లో పోలీసుల ఫెక్సీలు, పోస్టర్లు

వెంకటాపూర్(రామప్ప), మార్చి 3: అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి ప్రశాంత జీవనాన్ని గడపాలని ఎస్సై చల్ల రాజు అన్నారు. ఎస్పీ శబరీశ్ ఆదేశాల మేరకు వెంకటాపూర్ పోలీసులు ఆదివారం మండలంలోని ఎల్లారెడ్డిపల్లి, నల్లగుంట, లక్ష్మీదేవిపేట, బూర్గుపేట, తిమ్మాపూర్ తదితర గ్రామాల్లో ఈ మేరకు ఫ్లెక్సీలు, పోస్టర్లను ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్సై రాజు మాట్లాడుతూ గ్రామాల్లోని అమాయక ప్రజలను మావోయిస్టులు తమ పార్టీలో చేర్చుకోవడం సరికాదన్నారు. ప్రజల కోసమే తాము అడవుల్లో ఉద్యమిస్తున్నామని చెప్పుకునే మావోయిస్టులు తమ తల్లిదండ్రుల కోసం అడవిబాట వదిలి జనజీవనస్రవంతిలో కలవాలని సూచించారు. జనజీవన స్రవంతిలో కలిసిన వారికి ప్రభుత్వం తరఫున పునరావాసం కల్పిస్తామని ఎస్సై హామీ ఇచ్చారు. అదేవిధంగా పోలీసులు పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు.

● టేకుమట్ల : మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలవాలని ఏఎస్సై అమరేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెలిశాల గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ సందర్భంగా ఏఎస్సై అమరేందర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, ఎస్సై సుధాకర్ ఆదేశాల మేరకు వెలిశాల గ్రామంలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలం చెల్లిన సిద్ధాంతాలు వీడి కుటుంబంతో ప్రశాంత జీవనం సాగించాలని మావోయిస్టులకు సూచించారు. లొంగిపోయిన వారికి పోలీసు శాఖ పునరావసం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ సుమన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ జీరో బిల్లుల రీడింగ్ ప్రారంభం

వెంకటాపురం(నూగూరు), మార్చి 3: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ కార్యక్రమాన్ని ఆదివారం ఆ శాఖ ఏఈ సునీల్ ప్రారంభించారు. ఈసందర్భంగా సిబ్బంది మండల కేంద్రంలో ఇంటింటికీ తిరుగుతూ జీరో బిల్లులను రీడింగ్ తీసి లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ సిబ్బంది ఫరీద్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రేగొండ వాసికి ఉత్తమ రైతు పురస్కారం


అవార్డు అందుకుంటున్న శాంతిరెడ్డి

రేగొండ, మార్చి 3: మండల కేంద్రానికి చెందిన ఎడెల్లి శాంతిరెడ్డి ఉత్తమ రైతు అవార్డును అందుకున్నారు. సర్ సివి రామన్ అకాడమీ సాంస్కృతిక సేవా విభాగం ఆధ్వర్యంలో ఈ అవార్డును ఆయనకు హైదరాబాద్‌లో ప్రదానం చేశారు. వ్యవసాయం రంగంలో చేసిన సేవలు గుర్తించి ఈ పురస్కారాన్ని అందించినట్టు సంస్థ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు.

బౌద్ధ మహాసభ క్యాలెండర్ ఆవిష్కరణ

గణపురం, మార్చి 3: బౌద్ధ మహాసభ క్యాలెండర్‌ను కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులో ఆ సంఘం నాయకులు ఆదివారం ఆవిష్కరించారు. కేటీపీపీ చీఫ్ ఇంజనీర్ సిద్ధయ్య చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సీఈ మాట్లాడుతూ ఆరోగ్యం మీద శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పంచశీల సూత్రాలు, ఆర్యసత్యాలు, అష్టాంగ మార్గాన్ని అందరూ పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేకల శ్రీనివాస్, చందన్‌సింగ్, శ్రీధర్, కిషన్, శ్రీనివాస్, అనిల్, తిరుపతి, శారద, శ్యాం, రాజు, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.